కథానిక:

# ఉస్తి

శ్రీ కవికొండల వెంకటరావు

అతివాస్తవికతగా ఈ కథ వ్రాయాలి అంటే, వారం దగ్గఱ నుంచీ ప్రారంభించాలి. ఆ నాడు ఆదివారం. పట్నంలో కొట్లు, కూరగాయల అంగడి నుండి బంగారు వెండీ అమ్మే షరాబులఅంగళ్ల వఱకు మూసివేసియున్నాయి. ఉదయం పదిగంటలప్పుడు ఎండ బాగా పైకి వచ్చి రస్తా అంతా వెలుగు చూపుతూ వుంది. నడిచే మనుషులు కొద్దిమంది అయినా ముఖాలు తేటగా కనపరుచుకుంటూ, విశాల వక్షాలు విఱుచుకు నడుస్తున్నారు. పన్ను, బత్రా చెల్లించక్కఱలేని చిల్లర దుకాణదారులు, మామూలుగా నెత్తిమీద మూటవేసుకుని గంపలెత్తుకుని అమ్ముకునే వాళ్లు, పెద్దకొట్ల తిన్నెలమీద గిన్నెలు, గోణీలు, మట్టెలు, కట్టెలు, ఇలాంటి సరుకులు పఱుచుకుని అమ్ముకుంటూ వున్నారు.

చటుక్కున నడుస్తూ నడుస్తూ, ఒక గచ్చు అరుగు మీదకు నా చూపు వాలింది. అరుగు మీద ఇంద్రనీల మణులులా, ఆకుపచ్చగా కొన్ని, పవడాలు లాగు ఎఱ్ఱగా కొన్ని, పోసుపోసి కనబడ్డాయి. ఒకళ్లిద్దఱు చుట్టూ మూగి చూస్తూ వున్నారు. అరుగు క్రింద మురుగు కాలువ మీద కప్పిన మెట్టు రాతి మీద కూర్చుని ఒక ముసిలి స్త్రీ తన ముందు వున్న గడప మీద చేతులు వేసుకుని దారే పొయ్యే వాళ్లను చూస్తూ వుంది. కేక లెయ్యడం లేదు. ఆకలి బాధ అని అనడం లేదు.

చివరకు ఉండుండి ఒక వెకిలి నవ్వు నవ్వి— ముసల్దయినా పళ్లు అన్నీ ఇంకా అలాగేవున్నాయి!- నల్లని ముఖం చాయనే, తెల్లని పళ్లు ప్రతిఫలించేలా— నవ్వి— చుటూ మూగిన వారితో—"కావలిస్తే నేచెప్పిన ధరకు కొనక్కు పొండి! లేకుంటే అలా వుంచెయ్యండి... అవి నేను ఎంత కష్టపడి కోసుకొచ్చానో మీకేం ఎఱుక? "మునగాడ" కొండకెళ్లి రోజల్లా ఎండనకా, వాననకా, కొసకంటా ఎగబ్రాకి, ముళ్లంటా ముట్రంటా డేకి, వొంగి వొదిగి కోస్తే ఆపాళం చిక్కాయి. కావలిస్తే నే చెప్పిన ధరకు దమ్మిడీ తగ్గదు. పట్టుకు వెళ్లండి. లేకుంటే ఒగ్గెయ్యండి. నన్నెందుకు చంపుతారు?" అంది, కళ్ళుగుండా నవ్వుతూనే! మరొకళ్లు అయితే ఏడ్చి వుందురు!

"ఇవేం పవడాలు కావు, పచ్చలు కావు, అంత ధరొయ్యడానికి. — ముళ్ల కంచెను కాసే ముండా వుస్తి కాయలు. — వాటికే అంత ధరా?" అంది ఒక కోమటక్క గుంపు లోంచి బొంగురు గొంతెత్తి.

"పవడాలు, పచ్చలు అయితే తేరగా, తవ్వ మూడణాలకే ఇస్తారుటమ్మా, ఎవరైనా? నాకూ వస్తువు యొక్క ఆపాళం విలవా, నిలవా తెలుసు. మీరే నాగరీకు లని, మేమే వెట్టి వాళ్ల మని అనుకునేరు కాబోలు! పచ్చలు! పవడాలు! తవ్వ మూడు అణాల కొక్కనుక్కు పెట్టుకుందుగాని, అనుకున్నావు కామోసు. —! నిజంగా వీటి విలవ కడితే, పచ్చల్ని మించి వుండేవి! పవడాలను మించి వుండేవి! కట్టే వాడీ లోకంలో లేక తవ్వ మూడణాలు చేసి ఇచ్చేస్తానంటూ వున్నాను. — ఆకాడికే వొప్పకుండా వున్నారు మీరు!- నాగరీకులు! నాగరీకులు! ఎప్పుడు చూచినా పచ్చలు, పవడాల ఊసే! షరాబులు కొట్లు కట్టేసి న్నాడయినా మీ దృష్టి మఱో వైపునకు పోనిచ్చుకోరు!" అంది పెద్ద సిద్ధాంత రాద్ధాంతంగా, వృద్ధురాలు.

"మునగాడ కొండ అంటే ఇక్కడే కాదా అమ్మా!" అన్నాడు మఱో జేరగాడు. "ఇక్కడిదే! నేనూ ఇక్కడిదాన్నే! నన్ను మాత్రం రోజూ తమరు చూడ్డం లేదూ. మాలపిల్లి మాది! మంగి నా పేరు!" అంది తన వూరు, తన పేరు ఆ పట్నం అంతా ఆ సరికే మారు మోగి వుండాలనేవింత నమ్మకంతో ఆ అమ్మే మనిషి. "నాకీర్తి బూరా ఏక

మొకాల మీా నాగరీక ప్రపంచం అంతా రోజూ ఊదడమే కాకుండా కొమ్మతో బూజు కూడా ఊడ్చి వేసి క్రొంగ్రొత్తగా చూపించేని. అతగాడింకా ఎంచేతో ఈ పొద్దు రాలేదు గాని, వస్తే ఎగరేసుకు పోయేని ఇవన్నీ. మీా లా కీచు లాడకుండా" అని అందింక ఆ ముసల్ది.

"అతగాడు" అని ముసల్ది అనే లోపల అందఱి దృష్టి "ఎతగాడు ?" అనే ప్రశ్న వేసికొన్నట్టు తీవ్రత దాల్చింది.

కాని ఆమె కళ్లు మూసి వేసేసు కుంది. ఒకానొక స్వప్న వీధిని ప్రయాణం చేస్తూ వున్నది. పట్టణ రాజమార్గం కాదు అది. స్వప్న వీధి! "బేరగాండ్లెట్లా పోగలరు ఆ వీధిని ?" అని అడిగే టట్టు ఒకటి రెండు సార్లు ఆవలించి తిరుగ కలలో నిమగ్న రాలై పోయింది — ఆ కల ఇది —

నాడు దుర్దినము.పగలైనా ఉదయం నుంచి సూర్యుని అజా పజా లేదు.ఆమె యొక్క మాలగుడిసె మీాద ఎల్లా నల్ల మబ్బు ఆవరించి వుందో, అక్కడకు మూడు మైళ్ల దూరంలో తూర్పుగా నున్న "మునగాల" కొండల మీాద కూడా అంత నల్ల గాను మబ్బు ఆవరించి వుంది.ఆవరించి వుండడమే కాకుండ "అంభా" అని అంబోతు అఱచినట్టు ఉండుండి ఉఱిమి, ధారాపాతంగా కురిసింది. ఆమె, గుడిసె నుంచి ఈవలకు అడుగు పెట్టడానికే శక్యం లేనంత నీరు ఆవ అంతా ప్రవాహంగా మితి మీాఱి, మిఱ్ఱు పల్లం, ఏక వఱ్ఱు చేసి పారేసింది.రాత్రికి గాని ఆకాశం బొల్లివ్వ లేదు.దాంతో కొలది పాటి చుక్కలు, ఫులుగడిగిన ముత్యాల్లా తేటగా పొడ గట్టాయి.ఈ ముసల్ది నాటి వానచేత కొండకు పోలేదు. కొండకు పోవని కారణంగా మఱి ఇంట్లో తిండికి నూకలు లేక పోయినాయి. మర్నాడు కూడా ఆలాంటి దుర్దినమే అయివుంటే కొండకు వెళ్లకుండా గుడిసె లోనే ఆమె తన అవతారం చాలించ వచ్చు నను కొంది. కాని రాత్రి అలవడ్డ లేఱిపిని ఆమె కూపిరి దిట్టమై తెల్లవార గట్లనే కొండకు ప్రయాణం అయింది. కొండకు వెళ్ళి రోజూ ఆ వర్షాకాలం నాలుగు నెలలు కుంచెడు వుస్తి కాయలు కోసు కొచ్చి, పట్నంలో అమ్మకుంటేనే గాని ఆమెకు గత్యంతరం లేదు. ఆ కారణంగా మర్నాడు తెల్లాఱగట్ల లేచింది. ప్రయాణమైంది కొండకు.కాని దారి ఆ క్రితం రోజు ధారాపాతంగా పడ్డ వానకు ఎలా మారి పోయిందీ ఆమెకు గోచరించ లేదు.ఒక్క కొండే ఆమె చూపుకు నిబ్బరం గొలిపేని! కొండ మీాద ఆమె కోసే ఉస్తి పొదలు తెగ బలిసి వుండే కోన ఆమెకు జ్ఞాన చక్షువు లా దారి చూపిస్తూ వుంది!

"తలగడ్డ" పీక లోతొచ్చినా "కఱకట్టు" మొల్లోతొచ్చినా లెక్క చేయకుండా దిగి, గట్టెక్కి ముళ్ళంట, రేవళ్లంట, మోళ్లనక ముళ్లనక నడిచి నడిచి వాన పాటుకు కదలి పోయిన రాళ్ళ నాధారంగా చేసుకుని పడుతూ, లేస్తూ అలా కొండ కెగబాకి పోయింది. ఎగబాకి కొండెక్క వఱకు ఆకాశం బాగానే వుంది.సూర్యోదయం బ్రహ్మాండంగా పెంకె ఎఱ్ఱగా రంగు దాల్చి తొలి నాటి నల్లని మబ్బు మాటే ప్రజలు మఱచి పోయేలా చేసి వేసింది.అయితే సూర్యోదయం అయిన గంటలో తిరుగ మేఘం కయి గమ్మింది.కన్ను మిన్ను కనబడ్డం మానేసింది. ఏదో ఇంద్రజాల మహిమలా. ముసల్ది అప్పటికి సరిగా ఆ కొండను ఒక ఉస్తి పొదను అలా గుప్పిట పట్టి కోస్తూ వుంది, కాయలూ, పళ్లూ, ముళ్లు తప్పించు కొంటూ. ఆకాశం వంక ఆమె చూడ్డమే లేదు. చూస్తే మాత్రం లాభ మేమిటి ? పట్టే మేఘాన్ని ఇట్టలం గా కుండా చేయ లేదు ఆమె. కురిసే వానను వారించ లేదు ఆమె! పిడుగడ్డా మంచిదే, వడగళ్లు మణుగు మణుగు గుండు ల్లాంటివి పడి తన్ను అణగారించినా మంచిదే. అనే టంత నిరాశతో.- ఆ నిరాశ లోనే అత్యాశతో- ఎఱ్ఱని ఉస్తిపళ్లూ, పచ్చని ఉస్తికాయలు కోసి మరింత గుడ్డ పీలికలోప డేసు కుంటూ వుంది.— హఠాత్తుగా కింది కొండా, పై కొండా కూడాచిల్లడ్డట్టు గునపాల్లాంటి వర్షధారముందు దిగి, గాలి అందుకుని అదే కొర డాల్లా మారిచుఱ్ఱు చుఱ్ఱు ఆమె వొంటినంటి, అరె!ఆమె నిలువెల్లా కొయ్యబాఱ చేసింది.— జారి పోతూంది కొండనుండి క్రింద పాతాళం లోకి అమాంతంగా !- చెయ్యి అలా చాచింది.- ఒక ఉస్తి పొద అందింది. ముళ్లున్నదే! అయితేం ! ఆమె కుడి గుప్పిటకు పట్టి చ్చింది. ఆలా పట్టేసింది, పొదను. ఆ పొద వ్రేళ్లు ఎంత లోతుగా నాటుకు పోయి వున్నాయో, ఎటువంటి జిగురు మట్టిని పెనేసుకు పోయివున్నాయో, ఆమె బరువంతా వ్రేలాడి కొండను దిగలాడుతూ

వున్నా, పాదమాత్రం జంక లేదు. జరుగ లేదు. ముళ్లు ఆమె వొంటిని చీరుకు పోయి ఆమె కండ గల భాగాలన్నీ నెత్తురు చిమ్ములుగా చేసి పారేసింది. కాని ఆమె పట్టు వీడ లేదు. పాద శెసక లేదు.

అంతట వాన వెలిసింది. వానవెలిసే వెలవడంలో ఎవడో వచ్చి ఆమె వొళ్లు నిమిరి నట్టయింది. నిలువునా ఆమె గరిపొడిచింది. అతడు "నీ శరీరాన్ని ముళ్లేవో, గసుర్పుళ్లు ఏవో? నీ శరీరాన్ని నెత్తురు చిమ్ము లేవో, ఉస్తిపళ్లేవో? తెలియ నేరకున్నాను.—కొండ నుండి పై కెత్తడంలో పాదే వచ్చేస్తుందో నీవే వచ్చేస్తావో?" అంటూ ఆమెను లేవనెత్తాడు.— "నాయనా నన్ను లాగి పారేసినా గాని పాదను లాగి పార వేయకు." అంది ఆమె. "నిన్ను లాగి పార వేయడం లేదు. లేవ నెత్తు తున్నాను." "పాదను?" "అదే యోజిస్తున్నాను. నిన్ను దాని నుండి కేటాయించ లేకుండా వున్నాను." అన్నాడు అవల వ్యక్తి.

"ఈ మాత్రం మగవాడు ఈ కొండ నింకా వున్నాడంటే చాలు. నాకు నేనే పాద నుండి కేటాయించు కొని లేచి ప్రాణాల్తో దిగి పోగలను. నాకెవరి సాయమూ అక్కఱ లేదు." అంది ఆ ముసల్ది.

అవల వ్యక్తి "అయితే నే నెవర్నో నీకు ఆనావా లేను" అన్నాడు. ముసల్ది "ఆనవాలు లేకుండట మేమిటి? దేవుడవు! నా పాలి శ్రీ మహా విష్ణువువు. నే నెప్పుడు తలుచు కుంటే అప్పుడు ప్రత్యక్షు మాతూండు నాయనా! నాయనా!" అంది.—

అంటూ అమ్మహాపట్నపు నడి వీధిలో కుళ్లు కాలువను కప్పే రాతి పెట్టు మీద అలా కూలబడే కళ్ళు తెఱిచింది.

అరుగు మీద పోగు పోసిన వుస్తి కాయలు గాని, వుస్తి పళ్ళు గాని లేవు. చుట్టూ క్రితం మూగి బేర మాడుతూ ఆమెను వేపుకు తినే, ప్రజానీకం లేదు. వొళ్లో మాత్రం రెండు రూపాయల చిల్లర, తవ్వెడు నూకలూ వున్నాయి.

నిజంగా ఆ పట్న వాసస్థులు ఆమె నొక బిచ్చ కత్తె గా భావించారే గాని స్వస్నావబోధి గా పరి గణించ లేదేమో అని నా ఊహ. పాఠకులారా! మీ ఊహ ఏమిటి? వుస్తికాయలు, పళ్లు కొనుక్కున్నారంటారా? లేదు, వుస్తికాయలు, వుస్తి పళ్లు మేకలు తినేశాయి. కాకులు చిమ్మివేశాయి.

